# దోసిట్లో చీకటి

నిప్పు లేందే పొగరాదంటారు. కానీ ఒక్కోసారి నిప్పులేకుండానే పొగ వస్తుంది. రాజుకుంటుంది. ఇదిగో పులి అంటే అదిగో తోక అనే మనుషులు చాలామందే ఉంటారు. అలాంటి పోసుకోలు రాలుగాయిలవల్లే ఒక్కోసారి ఉన్నవీ, లేనివీ పుడుతుంటాయి. నిలకడగా ఉన్న నీళ్ళలోకి ఒక్కరాయి విసిరితే ఏమవుతుంది?

కవి చీకటివేళ—

సుబ్బరామయ్య లేగని వెతుక్కు రాబోయాడు. డొంకదాటి రైల్వే లైనుకేసి నడుస్తుంటే-వెనకనుంచీ పిలుపు వినిపించింది. నిలిచి చూసేడు. పొన్నుకర్ర మీద ఆనుకుని నిమ్మళంగా నిలబడ్డాడు.

వెంకయ్య వచ్చి కలిశాడు.

"నీకీ సంగతి తెలుసా అన్నా?" అంటూ మొదలెట్టాడు.

తెలీదన్నాడు సుబ్బరామయ్య.

వెంకయ్య పూసగుచ్చినట్లు వివరాలన్నీ చెప్తుంటే సుబ్బరామయ్య మొహంలో కళవళం కనిపించసాగింది. కోపం వచ్చింది. మిర్రిమిర్రి చూసేడు. పిట్టలు నిదానంగా గుండ్రంగా చేనుమీద ఎగురుతున్నై.

* * *

చంద్రాయి పుగాక్కువస్తే-షావుకారు చెంచయ్య ఆప్యాయంగా

కూరోచ్చబెట్టాడు.

వివరంగా చెప్పాడు, విషయాన్నంతా.

"ఆఁ, అట్లాగా" అంటూ నోరు వెళ్ళబెట్టిన ఆశ్చర్యంతో పైపంచె దులుపుకుని గబగబా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు చంద్రాయి.

శబ్దం లేకుండా ఏదో పక్షి రెక్కలు విసురుతూ అతని మీదుగా ఎగిరిపోయింది.

* * *

కోటమ్మ బుగ్గలు నొక్కుకుంది.

"ఆఁ, అవును వదినా" అని మరోసారి గుర్తు చేసింది కాంతమ్మ.

కొడుకుని పిలిచి, "ఇట్టా గంటగా అబ్బాయా" అనింది కోటమ్మ.

రాజుగాడు చొక్కా వేసుకుని గబగబా బయటికి బయల్దేరేడు.

రాలుచుక్క ఒకటి పడమరకేసి రాలింది.

* * *

మునసబుగారి వసారా సందడిగా ఉంది.

విషయాన్ని గురించిన తర్జన భర్జనలు ఓ మూలకి వెళ్ళిపోయాయి.

పళ్ళకొరుకుళ్ళూ, గుప్పిట బిగింపులూ కరకరలాడిన్నై.

ఊసరవెల్లి ఎండుటాకుల్ని గలగలలాడిస్తూ పరిగెత్తింది.

* * *

అయ్యవారి వట్టింట్లో-అప్పటివరకూ నడుస్తున్న శవాలకి అచేతనత్వం కమ్ముకొచ్చింది.

అరచేతిలో నిమ్మపండు కవి కట్టుకులోనయిందో, లేక అటూ యిటూ దొర్లిపోయిందో తెలీకుండా ఉంది.

నీళ్ళు పిలవగట్టిన చేలలా మారిన్నై గుండెలు.

విషయం పునశ్చరణ జరిగేసరికి స్వయంపాకం మనుషులకి కూడా

పెదవులు వణికినై: ఆపైన కదిలినై: ఆపైన బిగిసినై.

ఆవు కూడా రంకె వేసింది,

* * *

సిరిపల్లెలో సిరి మాత్రమే కాదు సంపదా ఉంది.

సిరి సంపదలతో పాటు దారిద్ర్యమూ, దైన్యమూ కూడా మేటవేసి వున్నై.

ఐదువేల గడప ఉంది ఊళ్ళో. ఊరికి ఒక మొగలో గూడెము, రెండో చివర తుంగభద్రా వున్నై. ఈ నడుమదాకా ఊళ్ళో తబిశీళ్ళులేవు. మనుషుల్లో పొరపొచ్చాలూ లేవు. మునసబుగారి లోగిలికి చంద్రాయి గుడిసె గౌరవాన్నిస్తూనే వుంది.

మొన్న సంక్రాంతికి—

భోగి రోజు రాత్రి ఊళ్ళో యక్షగానం పెట్టించారు. యక్షగానంలో వోకేతిగాడు చేరేడు. కథనంతా మంచి రసకందాయంలో పడేశాడు—తన చెణుకులూ చమత్కారాలతో. వాటిల్లో ఎక్కువ భాగం కలిగినోళ్ళ కండకావరం గురించే, గూడెం జనం కొంచెం అతిగానే ఆనందించారు. యక్షగానానికి రెడ్డిగారి మొహమూ, మునసబుగారి కళ్ళు కూడా బాగానే ఎరుపెక్కినై. వాటిని చూసిన ఈలలకి, చప్పట్లకీ మరింత ఉత్సాహం లేచింది.

అప్పట్నించీ—ఊళ్ళో కుమ్మపొగ పెట్టినట్లే వుంది. ఊళ్ళో మనుషులు ఒబ్బిడంగా వుండటంలేదు; మందు దట్టించిన క్వారీగా మారిపోయింది, ఊరు.

* * *

ఒక రాత్రి వేళ—

గూడెంలో ఓ గుడిసెకి అగ్గిబుట్టింది.

తెలవారు ఝామున పెదనాయుడిగారి గడ్డివామి బుగ్గి పాలయింది.

మర్నాడు-పగలల్లా పంచాయితీయే సరిపోయింది. సాయంత్రానికి కోటేశుగాడి వొళ్ళు హూనం అయింది. సుబ్బరామయ్య ఈ దండనని వ్యతిరేకించాడు. మునసబూ, పెదనాయుడూ ఆయన మీద కారాలు, మిరియాలు నూరసాగేరు. సుబ్బరామయ్య ధైర్యాన్ని అభినందించారు అయ్యవారు, రాజుగాడు. ఆ రాత్రి మునసబుగారి పశువుల చావడికి నిప్పంటుకుంది. తెల్లారేసరికి రాజుగాడి తమ్ముడి శవం తుంగభద్రలో తేలింది.

సందెవేళకి ఊరంతా రెండు ముక్కలై పోయి, బరితెగించిపోయింది. బరిసెలు, కర్రలూ, పలుగులూ, పారలూ, తమతమ విన్యాసాల్ని చూపినై. మరో గంటకల్లా పోలీసు లొచ్చారు.

పరిస్థితి అదుపులోకి వచ్చింది.

జనమంతా భయంతో పిడచగట్టుకుపోయారు. విచారణ మొదలైంది.

ఏకుల బుట్టలో తొక్కిపట్టిన ఆవేశాలు కావేశాలు, ఉక్రోషం-ఆక్రోషం, కసీ కార్పణ్యమూ!

ఎన్ని ప్రశ్నలు వేసినా సమాధానం రావడంలేదు.

ఏం జరిగిందంటే ఏమో అనే.

ఎలా జరిగిందంటేనూ ఏమో అనే.

అయ్యవారి నడిగితే చాలా అన్యాయం జరిగిపోయింది అన్నాడు. చంద్రాయి నడిగితే “ఛా....ఛా....ఛా...నేనిట్టాటి వాటికి శానాదూరం” అన్నాడు. రాజుగాడు “నన్నొదిలెయ్యండెహె నాకేం తెలీదు” అంటాడు. షావుకారు చెంచయ్య, “నన్నిడవకండీ యవ్వారంలోకి, నాకస్సలేభయం” అన్నాడు. పెదనాయుడూ, మునసబూ ఏదో మాట్టాడి పట్నం పోయారు. తననికొడితే తగిలిన దెబ్బలు చూపిస్తాడేగానీ, ఎందుకు కొట్టారంటే, ఏమోనంటున్నాడు కోటేశు. వెంకయ్య వెఱ్ఱోడి మొహం పెట్టి “నాకేం ఎరిక” లేదన్నాడు. సుబ్బరామయ్యని నిగ్గదీస్తే ఆయనకళ్ళల్లో నీళ్ళుతిరిగినై.

"నా లేగదూడా కనపడలేదు, రాజుగాడి తమ్ముడూ పోయ్యాడు" అనేసరికే గొంతుపూడుకు పోయింది.

భోగిరోజు రాత్రి-యక్షగానం దగ్గరికి వెనక్కి నడిచింది విచారణ. అయినా ఇదమిత్థంగా ఏమీ విషయసేకరణ జరగలేదు.

పెద్ద అధికారి వచ్చాడు. మరో విడత చర్విత చర్వణం జరిగింది.

'దాసుగాడు మునసబుగారమ్మాయిని అల్లరి చేశాడంట' అని ఎవరో సన్నగా కూశారు.

'ఎప్పుడు?' 'ఎక్కడ?'—

ప్రశ్నలు చకచకా కదిలినై.

'ఆ పిల్ల-పేరు ప్రసూన. పట్నంలో మేనమామ గారింటికి పోతుంటే రైల్వేస్టేషన్ దారిలో'-అని సమాధానం.

ప్రసూనను పిలవండన్నారు.

ప్రసూన ఇంకారాలేదు ఊరినుంచీ.

దాసుని లాక్కురండన్నారు. దాసు ఊళ్ళోలేడు.

మరెక్కడికి వెళ్ళాడు?

పట్నానికి పోయాడు. "ఆఁ ఇంకేం అప్పుడే వాడీ పనిచేసి ఉంటాడు?"

"వాళ్ళ అమ్మా, నాన్నా ఏరి?" వాళ్ళూ పట్నం పోయారు.

"ఎప్పుడు?" "అంతా ఒకేసారి."

"అదే ఎప్పుడు?" "నెలరోజుల క్రితం"

"ఎందుకు?" "దాసుకి ఉద్యోగమొచ్చింది"

ఆశ్చర్యం "ఆఁ" దగ్గర ఆగిపోయింది. ప్రసూన ఊరికి వెళ్ళేటప్పుడు దాసు ఊళ్ళోనేలేడు. ఇదీ తుది విచారణ.

ప్రసూన తిరిగి వచ్చింది ఊళ్ళోకి.

కట్లూ, మరకలతో, విరిగిన కర్రలూ, పగిలిన సోడా సీసాలతో కాలిన బూడిద, కూలిన కొంపలతో ఊరు స్వాగతం చెప్పింది ప్రసూనకు. ఆమెకు కడుపు రగిలిపోయింది.

అందర్నీ నిలబెట్టి-పేరు పేరునా-మీకు బుద్ధిలేదుగాక లేదని విసుక్కుంది. చిరాకుపడింది. చీదరించుకుంది.

ప్రసూనకు దానెవరో తెలిసే తెలీదు!!

మరి ఈ రాయి విసిరిందెవరు? వలయాలు సృష్టించిందెవరు? తెలీదు ఎప్పటికీ తెలీదు. అయితే ఎందుకు? సరదా కావచ్చు. అనాలోచితంగా కావచ్చు. పరిణామం, పర్యవసానం తెలియకా కావచ్చు. లేదా స్వార్థమూ వుండొచ్చు.

వెంకయ్యకు ఆ రాత్రి నిద్రపట్టలేదు. డొంకమీద సుబ్బరామయ్యతో తాను చెప్పిన మాటలే గుర్తుకు రాసాగినై. చేనుమీద విదానంగా గుండ్రంగా ఎగురుతున్న పిట్టలూ ఒకదాని వెంట ఒకటిగాసాగుతున్న గొర్రెలూ కళ్ళముందు కదలసాగినై. అతని గుండెలో తళుక్కున ఓ వెలుగు వెలిగింది.